క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


ఆశాలత


నందిని


మేఘన వెంకట దుర్గ


గరికిపాటి శిరీష

రాజానగరం: మండలంలోని పాతతుంగపాడుకు చెందిన బోయిడి ఆశాలత శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని ఎంఈఓ జ్యోతిప్రసాద్ తెలిపారు. అలాగే స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మింగి నందిని ఒంగోలుకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం నాగమణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాజ్ కుమార్ తెలిపారు.

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని శ్రీ పడాల పెద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థి పిల్లా మేఘన వెంకట దుర్గ ఎంపికయినట్లు పాఠశాల హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గురువారం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీలో ఒంగోలులో సీటు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

సీతానగరం: వెదుళ్లపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని గరికిపాటి శిరీషకు శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. ముగ్గళ్లకు చెందిన ఆ బాలిక పదో తరగతి పరీక్షల్లో 571 మార్కులు సాధించి, ప్రభుత్వ హైస్కూళ్లలో మండల ప్రథమస్థానంలో నిలిచింది. కాగా.. శిరీషను తల్లిదండ్రులు సత్యనారాయణ, వెంకటేశ్వరి, హెచ్‌ఎం సీతారత్నం, ఉపాధ్యాయులు అభినందించారు.

నైతిక విలువలపై అవగాహన

పెదపూడి: విద్యార్థులు వారి భవిష్యత్తుకు సంబంధించి కెరీర్ గైడెన్స్, నైతిక విలువలపై తప్పని సరిగా అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాశాఖాధికారి-2 సీ.వీ.వీ.సత్యనారాయణ తెలిపారు. పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పదో తరగతి అనంతరం ఏ కోర్సులు చదవాలి, ఎలా ఉపయోగపడతాయి అన్న అంశాలు వివరించారు.

కార్యవర్గం ఎన్నిక

రంగంపేట: మండల పరిధిలోని సింగంపల్లి గ్రామ నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం స్థానిక బీలాలమ్మతల్లి ఆలయం వద్ద జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి వినేటి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పేరూరి శ్రీను, ఉపాధ్యక్షుడిగా పసుపులేటి శ్రీను, కార్యదర్శిగా బిళ్ళకుర్తి శ్రీను, గౌరవ అధ్యక్షుడిగా పెంటపాడు సుబ్బారావులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మా భూములు ఇప్పించండి

గోకవరం: సీలింగ్ యాక్ట్ పేరుతో తమ వద్ద నుంచి తీసుకున్న భూములను తమకు ఇప్పించాలని మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు శుక్రవారం గోకవరం ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. గ్రామంలోని 7.64 ఎకరాల భూమిని సుమారు 50 ఏళ్ల నుంచి 12 మంది రైతులు సాగు చేసుకుంటున్నామని, ఈ భూములను 2015లో సీలింగ్ యాక్ట్ పేరుతో తమ నుంచి అధికారులు తీసుకున్నారన్నారు. ఈ భూమిపై ఆధారపడి జీవిస్తున్న తాము జీవనం కోల్పోయామన్నారు.

నారుమళ్ల పరిశీలన

పెదపూడి: భూమిలో పోషక విలువలు పెంచుకునేందుకు, అధిక దిగుబడి సాధనకు సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచి, రసాయన ఎరువులను పూర్తిగా తగ్గించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి టీ.వీ.ఆర్.మణిదీప్ రైతులకు సూచించారు. పెదపూడి గ్రామంలో వరి నారుమడులను ఆయన శుక్రవారం పరిశీలించారు. రైతులకు నారుమడులలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. భూసారాన్ని కాపాడుకుంటూ వ్యవసాయం చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి సమీపంలో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వారిలో కడియం గ్రామానికి చెందిన విఘ్నేష్ పరిస్థితి విషమంగా ఉంది. కోరుకొండ ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. కోరుకొండ నుంచి రాజమహేంద్రవరం వైపునకు వెళ్తున్న వెళుతున్న కారును.. రాజమహేంద్రవరం నుంచి మోటారుసైకిల్‌పై వస్తున్న కోరుకొండ ఎంపీటీసీ కోఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్ కుమారుడు తనీష్, అతడి స్నేహితుడు విఘ్నేష్ (కడియం) ఢీకొన్నారు. ఈ ఘటనలో విఘ్నేష్ తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రులను 108లో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు హాస్పటల్‌కు తరలించారు.

కార్పొరేటుకు దీటు.. సాంకేతికతకు చోటు

- ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించిన ప్రభుత్వం
- ఇక ఏటా అందజేయాలని నిర్ణయించిన సర్కారు
- ఎంతో ఉపయోగంగా ఉన్నాయంటున్న విద్యార్థులు


పందలపాకలో ట్యాబ్‌తో చదువుతున్న విద్యార్థులు

బిక్కవోలు: కార్పొరేటు స్కూళ్లలోని విద్యార్థులతో పోటీ పడేవిధంగా ప్రభుత్వ బడులలోని విద్యార్థులకూ సాంకేతికతతో కూడిన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. విద్యార్థులకు 8వ తరగతి నుంచే పాఠ్యాంశాల పై పూర్తి అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించి చర్యలు తీసుకున్నారు. గత ఏడాది 8వ తరగతి చదివే విద్యార్థులకు ట్యాబ్‌లను అందించారు. ఇలా ప్రతి ఏడాది 8వ తరగతి చదివే విద్యార్థులకు ట్యాబ్‌లను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ట్యాబ్‌లను అందిస్తున్నారు. బైజూస్ ద్వారా పాఠ్యాంశాలను ట్యాబ్‌లో పొందుపర్చారు. పూర్తి స్థాయి నాణ్యతా ప్రమాణాలతో కూడిన ట్యాబ్‌లను పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. నాడు – నేడు పథకం కింద కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. పాఠశాలలు తెరిచేనాటికే జగనన్న విద్యాకానుక కిట్‌లు అందజేస్తూ విద్యార్థుల చదువులకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూస్తోంది. ఉన్నత విద్యావేత్తల సూచనలు, సలహాలతో సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన అమలు చేస్తున్నారు.

మండలంలో ట్యాబ్‌లు అందుకున్నవారి వివరాలు

పాఠశాల	లబ్ధి పొందిన విద్యార్థులు
బిక్కవోలు	122
ఊలపల్లి	39
ఇలపల్లి	99
బలభద్రపురం	83
కాపవరం	27
పందలపాక	148
కొంకుదురు	44
మెళ్లూరు	11
ఆరికరేవుల	17
డీఈవో ఆఫీస్	5

విద్యార్థుల ఉన్నత చదువుల కోసం



నా పేరు కెంగం లక్ష్మీ చైతన్య. నేను పందలపాక ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్నారు. గత ఏడాది నాకు అందించారు. అది నాకు ఎంతో ఉపయోగంగా ఉంది. ట్యాబ్ ఇవ్వడం చాలా ఆనందం ఉంది.

– కెంగం చైతన్య, 9వ తరగతి విద్యార్థి, ఉన్నత పాఠశాల, పందలపాక

సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరం



నా పేరు చెల్లూరి హారిక. నేను పందలపాక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాను. విద్యారంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో విద్య అందించడం చాలా అవసరం. ట్యాబ్‌లు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది.

– చెల్లూరి హారిక, 9వ తరగతి విద్యార్థి, ఉన్నత పాఠశాల, పందలపాక

వలంటీర్లకు వందనం

పథకాలు అందించి.. భరోసా కల్పించి..


దయమ్మ వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్ శ్రావణి

రాజానగరం: సూర్యారావుపేట ఎస్సీపేటకు చెందిన ముప్పిడి దయమ్మకు భర్త లేడు. ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు సంతానం. వీరిలో ముగ్గురికి పెళ్లిళ్లు అయ్యాయి. నాలుగోవాడైన అబ్బాయి చదువుకుంటున్నాడు. అతడి ఆలనా, పాలన అన్నింటికీ కూలిపనే ఆధారం. దయమ్మకు ప్రభుత్వం ఇస్తున్న వితంతు పింఛన్‌ను సకాలంలో రావడానికి ఆ ప్రాంతానికి చెందిన వలంటీర్ శ్రావణి ఎంతో కృషి చేసింది. అలాగే ప్రభుత్వ పథకాల గురించి ఎప్పటికప్పుడు వివరిస్తూ, వర్తించే అవకాశమున్న వాటికి దరఖాస్తు చేయిస్తోంది. అలాగే కరోనా సమయంలో కూడా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందజేసింది. వారికి మేమున్నామనే భరోసా కల్పించింది. ఇలా ఆ ప్రాంతంలో ప్రజల చేత మన్ననలు పొందుతోంది.

కాలిబాట వంతెన నిర్మించాలని వినతి


కాకినాడలో ఎంపీ వంగా గీతకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: మండలంలోని కామరాజుపేటలో శ్మశానవాటికకు వెళ్లేందుకు కాలువపై వంతెన నిర్మించాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ శుక్రవారం కాకినాడలో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో విజ్ఞప్తి చేశారు. గ్రామంలో 12 కులాలకు చెందిన ప్రజలు కర్మకాండల నిమిత్తం కాలువ దాటి వెళ్లాల్సి ఉండగా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను ఎంపీపీ, జెడ్పీటీసీలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కాలువపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ వంగా గీతను లిఖితపూర్వకంగా కోరారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎంపీ వంగా గీతలను కలిసి వంతెన నిర్మాణానికి కృషి చేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోరే ప్రభుత్వమిది

గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి


వృద్ధురాలికి కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: నిరుపేదల అభ్యున్నతి కోసం, నిరంతరం ప్రజా సంక్షేమం కోరుకుంటున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కుతుకులూరులో శుక్రవారం ఐదోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనను అందిస్తున్నారని అన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల ముంగిటకే పాలన వచ్చిందని తెలిపారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా, ఏ ఒక్కరి సిఫార్సు లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందని తెలిపారు. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలతో సగర్వంగా ప్రజల చెంతకు వెళుతున్నామని అన్నారు. కార్యక్రమంలో భాగంగా గడప గడపకూ తిరుగుతూ ప్రజలందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, ఈ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వారికి చదివి వినిపించారు. సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సత్తి దొరయ్యరెడ్డి, ఉప సర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, పంచాయతీ వార్డు సభ్యుడు సబ్బెళ్ల ఆదిరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలతో సమాజంలో శాంతి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఘనంగా యూసీఏ వార్షికోత్సవం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ఏసుక్రీస్తు బోధనలతో సమాజంలో శాంతి ఏర్పడుతుందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్‌లోని నాగసాయి ఫంక్షన్ హాలులో శుక్రవారం యునైటెడ్ క్రిస్టియన్స్ అసోసియేషన్ (యూసీఏ) ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ క్రైస్తవుల ఆరాధన ఆధ్యాత్మిక శక్తిని పెంపొందిస్తుందన్నారు. హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్ జాన్‌వెస్లీ వాక్యసందేశాన్నిచ్చారు. అనంతరం జాన్‌వెస్లీ, ఎమ్మెల్యే రాజాలను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కమిటీ అధ్యక్షుడు చిర్రా ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎస్.ఆనందకుమార్, సెక్రటరీ పీజే రాజు, కమిటీ అసోసియేషన్ పెద్దలు ఒరిగేటి ప్రసన్నకుమార్, పాస్టర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు

అనపర్తి: నియోజకవర్గంలోని రంగంపేట మండలం ముకుందవరం గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముకుందవరానికి చెందిన మందనక్క ప్రసాద్, బోయి ప్రకాష్, సమ్మిడి అశోక్ కుమార్, పత్తి లచ్చన్న , కాటే సుభాష్, బిందుకూరి వీరబాబు, పి.అనిల్‌కుమార్‌తోపాటు మరో 12 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అవినీతి రహిత పారదర్శక పాలన, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాస్, రంగంపేట మండల ఇన్‌చార్జి నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయేల్, సొసైటీ అధ్యక్షుడు పోతుల బుల్లివీర్రాజు, సింగంపల్లి, కోటపాడు, మర్రిపూడి సర్పంచ్‌లు తుట్ట శివశంకర్ ఆనంద్, గవరసాని లక్ష్మీదుర్గ, వేణుమాధవి చిరంజీవి, పార్టీ నాయకుడు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా గడపగడపకూ..


బుచ్చెంపేటలో ఇళ్ల స్థలాల పట్టాలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం చేశారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం బుచ్చెంపేటలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో 68 మందికి ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. గ్రామంలోని 101 మందికి సంపూర్ణ గృహ హక్కు పథకం పేరిట రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది మహిళలకు ఇళ్ల స్థలాల పట్టాలిచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పేదలందరికీ సొంతిళ్లు ఉండాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. తొలుత గ్రామ సచివాలయం వద్ద నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో లబ్ధిదారులకు పట్టాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు అందించారు. అనంతరం జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.56 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును ప్రారంభించారు. మధ్యాహ్నం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకూ జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వంలో 120 గడపలు తిరిగారు. అనంతరం పశ్చిమగానుగూడెంలో రాత్రి 9 నుంచి 10.30 వరకూ 63 కుటుంబాలను కలిశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, పార్టీ నాయకులు కంటే వినయ్ తేజ, కల్యాణం రాంబాబు, కొండపల్లి దుర్గారావు, మద్దాల చంటిబాబు పాల్గొన్నారు.

సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి


ఆశ్రమానికి ఫ్యాన్లు అందజేస్తున్న కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు

రాయవరం: ఉన్నంతలో పేదల కోసం చేసిన సేవలే ప్రజల్లో హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ అనపర్తి మండల అధికార ప్రతినిధి, రామవరానికి చెందిన వ్యాపారవేత్త నల్లమిల్లి వెంకటరెడ్డి (789 శ్రీను) జన్మదిన వేడుకలు శుక్రవారం లొల్ల గ్రామ మానవతా ఆశ్రమంలో జరిగాయి. ఆశ్రమంలోని విద్యార్థుల సౌకర్యార్థం వెంకటరెడ్డి పద్మావతి దంపతులు రూ.15 వేల విలువైన ఫ్యాన్లను కృష్ణారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం నిర్వహించి, పండ్లు పంపిణీ చేశారు. రామవరం సర్పంచ్ గిరడా గంగాభవాని, ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, వార్డు సభ్యులు నల్లమిల్లి సంధ్య, కోరాడ నాగదేవి తదితరులు పాల్గొన్నారు.

పోస్టుమాస్టర్ వలీకి సన్మానం


వలీ దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

సీతానగరం: వంగలపూడిలో పోస్ట్‌మాస్టర్‌గా సేవలందించి, ఉద్యోగ విరమణ చేసిన షేక్ ఘనషా వలీని శుక్రవారం ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అల్లం శివాజీ గణేష్ ఆధ్వర్యంలో ఆ గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వలీ సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం వలీ, జన్‌హర్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో అల్లం దుర్గాభవాని, అల్లం సత్యవతి, షేక్ మదీనా బాషా, హామ్‌తావలీ, కాండ్రేగుల ఫణిబాబు, షేక్ నానాజీ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని కాంట్రాక్టర్ ఆత్మహత్య

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన కొట్టి దుర్గాప్రసాద్ (52) ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై డి.సమర్పణరావు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గాప్రసాద్ భవన నిర్మాణ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి మూడంతస్తుల భవనం ఉంది. ఈయన వద్ద 20 మంది తాపీమేస్త్రీలు పనిచేస్తున్నారు. ఇటీవల తీసుకున్న కాంట్రాక్ట్‌లో నష్టం రావడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో కుటుంబంలో గొడవలతో మనస్తాపం చెందాడు. తన మేడపైన ఉన్న పెంట్ హౌస్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసుల సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అర్హుల చెంతకే ప్రభుత్వ సేవలు

ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి


దుప్పలపూడిలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి


పందలపాకలో ధ్రువపత్రాలు అందిస్తున్న అధికారులు, నాయకులు


గోకవరం మండలం ఇటికాయలపల్లిలో..


పెదపూడిలో..


కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెంలో..


సీతానగరం మండలం ఉండేశ్వరపురంలో ..

అనపర్తి: అర్హులై ఉండి వివిధ కారణాలతో ప్రభుత్వ పథకాలకు నోచుకోని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం దుప్పలపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు కొండా ప్రేమలత, అనపర్తి సర్పంచ్ వారా కుమారి పాల్గొన్నారు. రామవరం సచివాలయం-1 పరిధిలో జరిగిన కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బిక్కవోలు: పందలపాక సచివాలయం-1 వద్ద జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు.

గోకవరం: ఇటికాయలపల్లిలో 1500 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

పెదపూడి: పెదపూడి సచివాలయం-2లో నిర్వహించిన గ్రామ సభలో 795 ధ్రువీకరణ పత్రాలు అందించారు.

మధురపూడి: కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెం, శ్రీరంగపట్నం2 సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు.

సీతానగరం: చినకొండేపూడి 2లో తహసీల్దార్ ఎస్.సత్యనారాయణరాజు, ఉండేశ్వరపురంలో ఎంపీడీవో కె.రమేష్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహించారు.

శాకంబరీదేవిగా మహాలక్ష్మి


మహాలక్ష్మి అమ్మవారు


సంపరలో శాకంబరి అలంకరణలో విజయదుర్గాదేవి

అనపర్తి: స్థానిక శాంతిపురంలో వేంచేసివున్న శ్రీ గణపతి, శ్రీ సరస్వతి సహిత శ్రీ మహాలక్ష్మి అమ్మవారు శుక్రవారం శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు రాంబాబు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని నిమ్మకాయలు, వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలతో అలంకరించి విశేష పూజలు జరిపారు.

శాకంబరిగా విజయదుర్గ

పెదపూడి: సంపర విజయదుర్గ అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం నాలుగో శుక్రవారం అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్ చెరువు జీరో పాయింట్‌కు సమీపంలో డివైడర్‌ని ఢీకొని కారు బోల్తా పడింది. ఈ ఘటనలో తండ్రీ కుమారులు స్వల్పంగా గాయపడ్డారు. దివాన్‌చెరువులోని గ్రామ సచివాలయంలో ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకునేందుకు కారులో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తిరగబడిన కారులో ఇరుక్కుపోయిన వారిద్దరినీ స్థానికులు సురక్షితంగా బయటకు తీసి ఇంటికి పంపించారు. ఈ విషయమై బొమ్మూరు ఎస్సై జగన్‌మోహన్‌రావును వివరణ కోరగా తమకు రిపోర్టు రాలేదన్నారు.